సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



పెరుగుతున్న టమాట ధరలు

అన్నమయ్య జిల్లాలోని మార్కెట్లలో టమాట ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. వారం క్రితం కిలో రూ.12 ఉన్న ధర ప్రస్తుతం రూ.30 వరకు చేరుకుంది. -8లో



వైఎస్సార్ సీపీలోకి చేరికలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తమ పయనమని నందలూరు మండలం లేబాక గ్రామానికి చెందిన వారు భావించి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.110	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 143 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం నియామక ఉత్తర్వులు అందాయి. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే, రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి రమేష్ కుమార్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి రెండు రోజుల క్రితం తన అనుచరగణంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశానుసారం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడటంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన, మొదటి గంట, బలి, శాత్తుమొర తదితర సేవలను జరిపారు. సాయంత్రం ఆలయంలో కులశస్థాపన, హోమాది కార్యక్రమాల అనంతరం అంకురార్పణ నిర్వహించారు. అలాగే రామ భక్తులు శ్రీరామ దీక్ష వ్రతమాలను ధరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ అధికారులు క్రిష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణరాజు భట్టర్, కృష్ణప్రసాద్ భట్టర్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

- శ్రీ పట్టాభిరాముడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉదయం ధ్వజారోహణం, ఊంజల్ సేవ, రాత్రి గజ వాహన సేవ నిర్వహించనున్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సీతారామ లక్ష్మణ మూలవిరాట్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 12వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 12న తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలుపుతారు. అనంతరం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది.

- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి శుక్రవారం ఒంటిమిట్ట రానున్నారు. ఈ విషయాన్ని టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఒంటిమిట్టలో జరిగే కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలిస్తారన్నారు.

పూలే అడుగుజాడల్లో నడవాలి



పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణరావు

రాయచోటి: అణగారిన వర్గాలకోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, మనమంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని డీఆర్‌ఓ సత్యనారాయణరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పూలే కులవివక్షతపై ఎన్నో పోరాటాలు చేశారని డీఆర్‌ఓ అన్నారు. అదే విధంగా దేశంలో కుల వివక్షతను రూపుమాపడం జరిగిందని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి సందప్ప మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కులకోసం, మహిళా సాధికారత కోసం మహాత్మాజ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారన్నారు.

సమత.. మమత.. మానవత

- జిల్లావ్యాప్తంగా ఈదుల్ ఫితర్ వేడుకలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు



కడప: సందేశం ఇస్తున్న ముఫ్తీ న్యామతుల్లా



బెంగుళూరు రోడ్డులోని ఈద్గాలో ఈద్ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

రాయచోటి : ప్రశాంతమైన వదనాలు..చిరునవ్వులతో పలకరింపులు..భక్తులందిరిలోనూ ఆధ్యాత్మిక భావనలు...అందరూ ఏకేశ్వరుడైన అల్లాహ్ గురించే 'తక్బీర్' చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తహతహలాడారు. మనసునిండా అల్లాహ్ బోధనలే. ప్రతి భక్తునికి మరో భక్తునితో ఆధ్యాత్మికతమైన బాంధవ్యం పెనవేసుకుంటున్న దృశ్యాలు. ఆత్మీయతకు ప్రతిరూపంగా ఆలింగనాలు. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, సోదరాభావం వెల్లి విరియాలని ముస్లిం మత గురువులు మనసారా ఆక్షాంక్షించారు. పవిత్రమైన రంజాన్ (ఈదుల్ ఫితర్) పండుగ ప్రత్యేక ప్రార్థనలు గురువారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలను పాటించి అల్లా అనుగ్రహాన్ని పొందారు. బుధవారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో రంజాన్ ముగిసింది. గురువారం ఉదయం జిల్లాలోని ఈద్గాలు, మసీదుల వద్దకు అధిక సంఖ్యలో చిన్నా పెద్దలు హాజరై భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నా పెద్దలు పరస్పరం అలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పండుగ సందర్భంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులను కలుసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పారు. ప్రార్థనలలో భాగంగా మత పెద్దలు ఆ అల్లా చల్లని దీవెనలతో వర్షాలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమని పెద్దలు ఉపదేశించారు. జిల్లాలో ఏటా హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకుని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా రాయచోటిలోని ఈద్గా మైదానంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, రైల్వేకోడూరు సోప్ ఫ్యాక్టరీ సమీపంలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనలలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట పట్టణ పరిధిలోని ఈద్గాలో జడ్పీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.అమరనాథరెడ్డి, మదనపల్లెలోని బెంగళూరు రోడ్డు ఈద్గా మైదానం , బసినికొండ డ్రైవర్స్ కాలనీలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను అలింగనం చేసుకుని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



రాయచోటిలోని ఈద్గా మైదనంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

కడప కల్చరల్: కడప నగరం బిల్టప్ ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మత గురువులు ముఫ్తీ న్యామతుల్లా పండుగ సందేశాన్ని అందజేశారు. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు నమాజే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రంజాన్‌మాసం అనంతరం కూడా నమాజ్ ప్రార్థనలను వీడబోమన్నారు. దేవుని కృప కటాక్షాలకు నమాజ్‌కు మించి మార్గం లేదన్నారు. విలువైన మానవజన్మ ఇచ్చినందుకు జీవితాంతం ప్రార్థనలతో కృతజ్ఞతలు తెలుపుకుంటామన్నారు. జిల్లా వాసి పాలకుడిగా ఉండడం జిల్లా వాసులకు ప్రత్యేక ఆనందం ఇస్తోందని, రానున్న ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. రాష్ట్రమంతటా సుభిక్షంగా ఉండాలని, కరువు కాటకాలు రాకూడదని ఆకాంక్షిస్తున్నామన్నారు.

మండుతున్న ఎండలు..

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..
- వేడిగాలులతో అల్లాడుతున్న ప్రజలు..

రాయచోటి: ఎండలు మండిపోతున్నాయి. పట్టణీకరణ, గ్లోబల్ వార్మింగ్ కారణాలతో ఏటా సరికొత్త ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో ఉదయం 9 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉదయం 10 గంటలకే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. గతేడాది ఏప్రిల్ నెల కంటే నాలుగు డిగ్రీలు అధికంగా 41 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రత ఉంది. ఎండతో పాటు వేడి గాలులతో జనం అల్లాడిపోతున్నారు. మరోవైపు రాత్రి పూట ఉష్ణోగ్రతల్లోనూ భారీ పెరుగుదల ఉంది. రానున్న రోజుల్లో భానుడి భగభగలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గినట్లు కనిపించినా వేడి గాలుల తీవ్రత మాత్రం తగ్గడం లేదు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వడదెబ్బ ముప్పు పొంచి ఉంది. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, షుగర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, వృద్ధులు బయటకు రాకూడదు. బయటకు వెళ్లాల్సి వస్తే.. గొడుగు, తలకు టోపీ తప్పకుండా ధరించాలి. మాంసాహారం తగ్గించాలి. రోజుకు కనీసం 4 లీటర్లకు పైగా నీళ్లు తాగాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలి. –డాక్టర్ బండారు కిరణ్, ప్రభుత్వ వైద్యులు, రాయచోటి

ఏప్రిల్ 1 నుంచి 11వ తేదీ వరకు ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	గరిష్టం	కనిష్టం
1న	39.0	22.0
2	40.0	23.0
3	40.0	23.0
4	41.0	23.0
5	41.0	23.1
6	42.0	25.0
7	41.0	23.0
8	41.0	23.8
9	38.1	22.2
10	38.2	23.1
11	39.0	24.0



ఎండల కారణంగా కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చల్లంగా చూడమ్మా.. గంగమ్మా



గంగమ్మ జాతరలో భక్తజనసందోహం (ఇన్‌సెట్) భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ

- అంబరాన్నంటిన జాతర సంబరం
- భారీగా తరలి వచ్చిన భక్తులు

రాజంపేట టౌన్: మున్సిపాలిటీలోని బలిజపల్లెలో గురువారం జరిగిన గంగమ్మ జాతర సంబరం అంబరాన్నంటింది. జాతర వేడుక బుధవారం అర్ధరాత్రి నుంచే ఆరంభమైంది. తొలుత జాతర నిర్వహణలో భాగస్వామ్యులైన నారపురెడ్డిపల్లె నిర్వాహకులు, ప్రజలు గంగమ్మ సోదరుడైన పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం తుమ్మల అగ్రహారానికి చెందిన మహిళలు పెద్దఎత్తున గండదీయలు తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆ గ్రామానికి చెందిన యువకులు తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేయడం, బాణాసంచా కాల్చడంతో గ్రామంలో కోలాహలవాతావరణం నెలకొంది. కాగా నారపురెడ్డిపల్లె, తుమ్మల అగ్రహారం గ్రామాలకు చెందిన భక్తులు చేరుకోవడం, ఈలోపు అమ్మవారి ప్రతిమ తయారు కావడంతో బలిజపల్లెకు చెందిన బలిజపల్లె నిర్వాహకులు రథంలో గంగమ్మను ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలో కొలువుదీర్చారు. గంగమ్మను గుడిలోకి తీసుకొచ్చేందుకు ఊరేగిస్తున్న సమయంలో వందలాది మంది భక్తులు అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మా..గంగమ్మా కరుణించమ్మా అంటూ వరపడ్డారు. అమ్మవారిని గుడిలోకి తీసుకొచ్చే సమయంలో భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం దాదాపు కిలోమీరు దూరంమేర క్యూలైనులో ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు త్వరపడటంతో పోలీసు అధికారులు, సిబ్బంది భక్తులను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

దారులన్నీ జాతరవైపే

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో బుధవారం అర్ధరాత్రి నుంచే భక్తులు బలిజపల్లె గ్రామానికి చేరుకునేందుకు నాలుగువైపుల ఉన్న దారుల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో పట్టణంలోని అన్ని ప్రాంతాలు కోలాహలంగా మారాయి.

గంగమ్మను దర్శించుకున్న ఆకేపాటి, పోలా

జాతర సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి, పోలా విలేకరులతో మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనసాగించారని, మరోమారు ఆయనకు అవకాశం కల్పించాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిపించి ప్రజలందరికి సిరిసంపదలు ఇవ్వాలని గంగమ్మకు వరపడినట్లు తెలిపారు. జాతర సందర్భంగా అనేక మంది మానవతా మూర్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గంగమ్మ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బలిజపల్లె పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉచితంగా మంచినీటి, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పలువురు భోజనం, పులిహోర వంటి ఆహార పదార్థాలను భక్తులకు అందచేశారు.

నయా జోష్!



- ప్రజా మద్దతు ఓవైపు.. నాయకుల ఆదరణ మరో వైపు
- ఊపుమీదున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- 5 పర్యాయాలు టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసినసిన వారిలో సైతం మార్పు
- టికెట్ కేటాయింపులో టీడీపీ ఫెయిల్
- నారా లోకేష్ మార్క్‌తో ఇన్‌చార్జిలకు మొండిచేయి

సాక్షి ప్రతినిధి, కడప: సామాన్యులకు మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ఆయా పథకాల లబ్ధిదారుల మద్దతు ఓవైపు, క్రమం తప్పకుండా నాయకుల చేరికలు మరోవైపు ఉండడంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ జోష్ మీదుంది. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, కడప, రాయచోటి నియోజకవర్గాల్లో ఫ్యాన్ హైస్పీడ్‌లో పరుగెడుతోంది.ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఊపుమీదున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీలో నయా జోష్ కన్పిస్తోంది.

- తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా ప్రచారం చేసుకున్నవారికి టికెట్ దక్కలేదు. నారా లోకేష్ అభయంతో కొందరు, అధిష్టానం మాట ఇచ్చిందని కొందరు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. తీరా అభ్యర్థిత్వం ఖరారు నాటికి జాబితాలో వారి పేర్లు గల్లంతయ్యాయి. అప్పటి వరకు టీడీపీ అంతా తామే అనుకున్న నేతలు తెరమరుగయ్యారు. అలాంటి వారి జాబితాలో గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బత్యాల చెంగల్‌రాయుడు, రమేష్‌కుమార్‌రెడ్డి, దొమ్మలపాటి రమేష్, శంకర్‌యాదవ్ తదితరులు ఉన్నారు. ఐదేళ్లు పాటు టీడీపీ ఇన్‌చార్జీగా పార్టీ ఉన్నతి కోసం పనిచేసిన ఆయా నాయకులకు అధిష్టానం మొండిచేయి చూపింది. దీంతో పలువురు నాయకులు తెరవెనుకకు వెళ్లాల్సిన దుస్థితి టీడీపీలో నెలకొంది. దిగువ స్థాయి కేడర్‌లో సైతం అయోమయం నెలకొంది.

సుదీర్ఘకాలంలో టీడీపీలో పనిచేసిన నేతలు సైతం....

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ వచ్చిన నేతలు, అనేక పర్యాయాలు అభ్యర్థులుగా పోటీ చేసిన నాయకులు సైతం తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాంటి వారిలో ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఆవిర్భావం నుంచి టీడీపీనే అంటిపెట్టుకొని ఉన్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, క్రియాశీలక నేతగా ఉన్న కమలాపురం సాయినాథశర్మలాంటి వారు కూడా టీడీపీ వీడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఆయా అభ్యర్థుల తలబిరుసు తనంతోనే కొందరు, అధిష్టానం తీరుతో మరికొందరు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాంటి వారి జాబితాలోకి వచ్చి చేరేందుకు మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో తెలుగుదేశం పార్టీ అత్తెసరు పోటీ ఇస్తున్న తరుణంలోఉన్నవారిని కూడా పోగొట్టుకొని అధికారపార్టీ కంటే వెనుకబడిందని విశ్లేషకులు సైతం వివరిస్తున్నారు.

అయోమయంలో టీడీపీ అభ్యర్థులు...



వరుస పరాజయపాలైన వారు కొందరు, అవకాశం కోసం ఎదురుచూపులు చూస్తున్న వారు మరికొందరు ఈమారు టీడీపీ అభ్యర్థులయ్యారు. ప్రజాక్షేత్రంలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యారు. అయితే అధిష్టానం చర్యల కారణంగా అయోమయ పరిస్థితి ఉత్పన్నమైంది. బీజేపీ పొత్తు గెలుపునకు ప్రధాన అడ్డంకిగా మారిందని పలువురు వాపోతున్నారు. ప్రతి నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓటర్లు గణనీయంగా ఉండడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. స్వతహాగా వైఎస్సార్‌సీపీ పట్ల సానుకూలతతో ఉండడం ఒక ఎత్తయితే, బీజేపీలో టీడీపీ పొత్తులో ఉండడంతో ముస్లింల ఓట్లు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలువనున్నట్లు విశ్లేషకులు వివరిస్తున్నారు. ప్రజామద్దతు, పార్టీలో చేరికలు సమీకరణలు నేపథ్యంలో కడప, రాజంపేట పార్లమెంటు పరిధిలో వైఎస్సార్ సీపీ జోష్‌మీదున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

మళ్లీ పెరుగుతున్న టమాట ధరలు

- మార్కెట్‌లో కిలో రూ.30
- వారం రోజుల్లో 50 శాతం పెరిగిన ధర
- రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం

గుర్రంకొండ : జిల్లాలోని మార్కెట్‌లో టమాట ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం కిలో రూ.30 వరకు పలుకుతున్నాయి. వారం రోజుల క్రితం రూ.12 నుంచి రూ.14 వరకు మాత్రమే ఉండేవి. వారం రోజుల్లోనే 50 శాతానికి పెరిగాయి. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎండలకు దెబ్బతిన్న తోటలు

రాయలసీమతోపాటు బయట రాష్ట్రాల్లో ప్రస్తుతం వేసవి ఎండలకు టమాట తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడ దిగుబడులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. అయితే మన జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల్లో ఎంతో కొంత దిగుబడి వస్తోంది. దీంతో ఇప్పుడిప్పుడే మార్కెట్లో టమాట ధరలు పుంజుకొంటున్నాయి. జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రస్తుతం 13565 ఎకరాల్లో టమాట పంట దిగుబడి వస్తోంది. రాయలసీమ వ్యాప్తంగా ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు దిగుబడి అంతగా రాదు. అధిక ఎండల కారణంగా బయట జిల్లాల్లో టమాటల పంట సాగవదు. పడమటి మండలాల్లోనే ఎండ వేడమికి తట్టుకొని కొంత మేరకు సాగు అవుతుంది. అయితే గతేడాదితో పోల్చితే ఎండలు ఎక్కువగా ఉండటంతో టమాట తోటలను కాపాడుకోవడం కోసం రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు.

1600 నుంచి 720 మెట్రిక్ టన్నులకు పడిపోయిన స్టాక్

మన జిల్లాలో 15 రోజుల క్రితం 1600 మెట్రిక్ టన్నుల టమాటల స్టాకు మార్కెట్లకు వచ్చేది. వేసవి అధిక ఎండలకు తోటలు దెబ్బతిని ప్రస్తుతం 720 మెట్రిక్ టన్నుల స్టాకు మాత్రమే వస్తోంది. గత నెలలో టమాట పంటల సాగు గానీ, దిగుబడులు గానీ ఎక్కువగా ఉండేది. రోజురోజుకు పెరిగిపోతున్న ఎండల ప్రభావంతో టామాట తోటల్లో దిగుబడి తగ్గిపోతోంది. దీంతో రోజురోజుకు జిల్లాల్లో మార్కెట్లలో టమాటల స్టాకు భారీగా తగ్గిపోతుండటం గమనార్హం.

పుంజుకుంటున్న ధరలు

ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో టమాట ధరలు పుంజుకొంటున్నాయి. వారం రోజుల కిందట కిలో రూ.12 నుంచి రూ.14 వరకు పలికాయి. 25 కేజీల క్రీట్ రూ.300 నుంచి రూ.350 వరకు పలికాయి. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పుంజుకోవడంతో కిలో రూ.30 వరకు పలుకుతున్నాయి. 25 కేజీల క్రీట్ రూ.750 వరకు పలుకుతోంది. మొదటి రకం కిలో రూ.30, రెండో రకం రూ.24, మూడో రకం రూ.18 వరకు పలుకుతున్నాయి.


మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటలు

ధరలు మరింత పెరిగే అవకాశం

రాబోయే రోజుల్లో టమాట ధరలు మరింతగా పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఎండలకు టమాటలపై బొబ్బలు, మెత్తబడిపోవడం జరుగుతోంది. దీంతో బయట రాష్ట్రాలకు తరలించే అవకాశముండదు. బయట రాష్ట్రాలకు తరలించాలంటే కనీసం 4 నుంచి 6 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న టమాటలు రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు స్టాకు ఉంచుకొనే పరిస్థితి లేదు. దీంతో బయట రాష్ట్రాల్లో అధిక డిమాండ్ ఏర్పడి.. ఇక్కడ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

వారం రోజులుగా జిల్లాలోని మార్కెట్లకు వచ్చిన స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25 కేజీల క్రీట్)
5	1585	350
6	1495	400
7	1367	485
8	1145	575
9	976	650
10	834	690
11	714	750

ఎండలకు తగ్గిన దిగుబడి



ప్రస్తుతం టమాట ధరలు బాగా పుంజుకొన్నాయి. మార్కెట్లో ప్రస్తుతం కిలో ధర రూ.30 వరకు పలుకుతున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడం, టమాట దిగుబడి తగ్గిపోతుండడం ధరల పెరగడానికి కారణంగా చెప్పుకోవచ్చు. గతంలో ప్రతి రోజు టమాట మార్కెట్లకు 1600 మెట్రిక్ టన్నుల స్టాకు వచ్చేవి. ప్రస్తుతం 720 మెట్రిక్ టన్నుల స్టాకు మాత్రమే మార్కెట్లకు వస్తోంది. **- కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం**

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సులభతరంగా ధ్రువపత్రాలు



గతంలో మా పిల్లల కోసం ఏవైనా ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుని వారం. అనంతరం పత్రాలు చేదికందాలంటే మీసేవా, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే ఈ ప్రభుత్వ హయాంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గ్రామ వలంటీర్‌కు తెలపడం జరిగింది. ధ్రువపత్రాలు ఒక్కరోజులోనే మా ఇంటి వద్దకు తెచ్చి ఇచ్చారు. సులభంగా పత్రాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- ఆర్.హుస్సేన్‌బీ, దుర్గానగర్, పీలేరు

సొంతింటి కల నెరవేరింది



మేము పట్టణంలోని రోటరీపురంలో కొనేళ్లుగా అద్దె ఇంటిలో నివసిస్తున్నాం. సొంతింటి కోసం అనేక మార్లు దరఖాస్తు చేసుకున్నా.. ఆ కల నెరవేరలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో చెప్పిన విధంగా పేదల సొంతింటి కల నెరవేర్చడానికి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో భాగంగా నాకు ఇల్లు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం.

- అనీఫా, రోటరీపురం, పులివెందుల

అయ్యో.. ఎంత పని చేశావు దేవుడా..

'అయ్యో దేవుడా!.. ఎంత పని చేశావు.. ఈ కుటుంబానికి ఇన్ని కష్టాలు పెట్టావు.. పగవారికి కూడా ఇలా జరగకూడదు' అంటూ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు భార్య సపర్యలు చేస్తూ అక్కడే ఉంది. ఈ క్రమంలో కుమార్తె చెరువులో పడి తిరిగిరాని లోకాలకు వెళ్లింది. ఆ బాలికను కాపాడేందుకు ప్రయత్నించిన మేనత్త పరిస్థితి విషమంగా మారింది. మూడు నెలల క్రితం బాలిక నాయనమ్మ మృతి చెందింది. ఇలా వరుస సంఘటనలతో ఆ కుటుంబం తల్లడిల్లుతోంది.

- కన్నవాళ్లు ఆసుపత్రిలో.. మేనత్త సంరక్షణలో పిల్లలు
- చెరువులో జారిపడి బాలిక మృతి
- కాపాడబోయిన మేనత్త పరిస్థితి విషమం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ ఉప్పరవాండ్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఇమ్మానుయేలు దినసరి పెయింటర్ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించే వాడు. ఈ నేపథ్యంలో 10 రోజుల క్రితం అంగళ్లు సమీపంలోని కంటేవారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇమ్మానుయేలుకు వెన్నుముక దెబ్బతింది. అప్పటి నుంచి తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి సర్యలు చేసేందుకు భార్య శివకుమారి ఆసుపత్రిలోనే ఉంటోంది. ఈ దంపతుల సంతానమైన లియోనా (11), నక్షత్ర (6)లను ఇమ్మానుయేలు చెల్లెలు ప్రేమలత ఇంట్లో వదిలి ఆసుపత్రికి వెళ్లారు. గత పది రోజుల నుంచి అన్న పిల్లల ఆలనా పాలన బాగా చూసుకుంటున్న మేనత్త ప్రేమలత గురువారం బట్టలు ఉతికేందుకు సమీపంలోని రంగసముద్రం చెరువుకు వెళ్లింది. ఆమె వెంట బాలికలిద్దరూ వెళ్లారు. ఈ తరుణంలో ఆరేళ్ల వయసున్న నక్షత్ర ప్రమాదవశాత్తు చెరువులో పడటంతో బాలికను కాపాడేందుకు అక్కడే ఉన్న లియోనా, ప్రేమలతలు చెరువులోకి దూకి కేకలు పెట్టారు. గ్రామస్తులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని నక్షత్ర, ప్రేమలతను కాపాడి గట్టుకు చేర్చారు. అయితే లియోనా (11) నీటిలో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన బాలిక రంగసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో ఆరవ తరగతి చదువుతోంది. మేనత్త ప్రేమలత పరిస్థితి విషమంగా మారడంతో సర్పంచ్ శ్రీదేవి భర్త రామక్రిష్ణ 108 వాహనం ద్వారా మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి కేసులు వద్దని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు వివరించారు.


మృతి చెందిన బాలిక లియోనా


అక్క మృతదేహం ఎదుట బిక్క చూపులు చూస్తున్న చిన్నారి

అక్క మృతదేహం ఎదుట చిన్నారి బిక్క చూపులు

'అక్క లియోనాను ఇంటి వద్ద ఎందుకు పడుకోబెట్టారు. చుట్టూ బంధువుల ఆర్తనాదాలు. ఇవన్నీ అడగటానికి అమ్మా, నాన్నలు ఇక్కడ లేరు, మేనత్త కూడా కనపించడం లేదు. ఏం జరిగిందోనని' బిక్క చూపులు చూస్తూ కంటతడి పెడుతున్న ఆరేళ్ల చిన్నారి నక్షత్రను చూసిన గ్రామస్తుల కళ్లు చెమ్మగిల్లాయి. ఉప్పరవాండ్లపల్లిలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

మూడు నెలల క్రితం బాలిక నానమ్మ మృతి

మూడు నెలల క్రితం రంగసముద్రం సమీపంలోని బొంతావారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక నానమ్మ శిరోమణి మృతి చెందింది. ఆ షాక్ నుంచి కోలుకుని పెయింటర్ పనికి వెళ్లి వస్తున్న బాలిక తండ్రి ఇమ్మానుయేలు నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని 10 రోజుల క్రితం టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ ఎనమలవారిపల్లెకు చెందిన శంకర భార్య రామలక్ష్మి(32) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ పెద్ద ఊరు కూలోళ్లగడ్డకు చెందిన టి.లావణ్య కుమారుడు టి.మొగిలి (22) కుటుంబ సమస్యలతో స్థానికంగా లభించే పసరు గడ్డలు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

అనాథను ఆసుపత్రిలో చేర్చిన సూపరింటెండెంట్

మదనపల్లె : ఆస్పత్రి ఆవరణలో అనాథగా పడి ఉన్న మహిళను మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు స్థానిక జిల్లా ఆసుపత్రి ఐసీయూ విభాగంలో చేర్పించారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన రామస్వామి భార్య తాయమ్మ (70) గత కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేక, పట్టణ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ రోడ్డు పక్కన జీవిస్తుండేది. ఆమె అనారోగ్యానికి గురి కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించగా.. పది రోజుల క్రితం జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే రెండు రోజుల చికిత్సల అనంతరం ఆమె ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లిపోయింది. గత మూడు రోజులుగా తిరిగి ఆసుపత్రి ఆవరణకు వచ్చి, అత్యవసర విభాగం ఎదుట చెట్టు కింద ఉండిపోవటంతో, స్థానికులు కొందరు ఆమెకు సపర్యలు చేసి ఆహారం అందించారు. గురువారం ఆస్పత్రి అత్యవసర విభాగానికి వచ్చిన సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు చెట్టు కింద ఆమె అనారోగ్యంతో పడి ఉండడాన్ని గుర్తించారు. ఆమె బంధువులు ఎవరూ లేకపోవడంతో, ఆమెకు ఐసీయూ విభాగంలో చికిత్సలు అందించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అనాథ మహిళను ఆసుపత్రి సిబ్బంది ఐసీయూ విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మేరీ మాత విగ్రహం కళ్లలో రక్తం!



మేరీ మాత విగ్రహం కళ్లలో రక్తం కారుతున్న దృశ్యం, విద్యార్థిని చేతిలో కారుతున్న రక్తం

రామాపురం : గత మూడు రోజులుగా రామాపురం ఆర్సీఎం చర్చిలో మేరీ మాత విగ్రహం కళ్లలో, అలాగే ఆమె భక్తురాలు ఒరిస్సాకు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రతిభకు చేతులు, కాళ్లలో రక్తం వస్తోందనే వదంతులు వ్యాపించాయి. ఈ దృశ్యాన్ని చూడటానికి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి ప్రజలు తరలిరావడం విశేషం. ఈ విషయంపై కడపలోని ఆరోగ్య మాత పుణ్య క్షేత్రంలో పని చేస్తున్న ఎస్ఎండీ ప్రసాద్‌రావును వివరణ కోరగా.. పలు రాష్ట్రాల్లో కూడా ఈ విధంగా జరుగుతోందని, ఏసుప్రభువు విగ్రహానికి కూడా కళ్లు, చేతులు, కాళ్లలో రక్తం రావడం సహజమేనని, దేవుని కృపతో అక్కడక్కడా ఈ విధంగా కనిపిస్తూ ఉంటుందన్నారు. కొన్ని రోజులు రక్తం కారుతుందని, మళ్లీ తగ్గిపోతుందని తెలిపారు. ఈ విషయంపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు ఆయన సూచించారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులతో మాట్లాడగా.. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాతే స్పందిస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న పోలీసులు

ములకలచెరువు : అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మండలంలోని చౌడసముద్రం పంచాయతీ గుత్తావారిపల్లెకు చెందిన బుక్కే కృష్ణానాయక్(47) తన నివాసంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి 184 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు


స్వాధీనం చేసుకున్న వాహనాలు

- రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలు స్వాధీనం
- పట్టుబడిన అన్నమయ్య జిల్లా వాసి

కదిరి టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా) : ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి రూ.15 లక్షల విలువ చేసే 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కదిరి సీఐ పుల్లయ్య తెలిపారు. వివరాలను గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. గత రెండు నెలలుగా శ్రీ సత్యసాయి జిల్లాలోని కదిరి పట్టణంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలు జరిగాయి. వీటిపై కేసు నమోదు చేసిన పోలీసులు కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం కదిరి – రాయచోటి మార్గంలో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట గ్రామానికి చెందిన మామిళ్ల వీరారెడ్డిని ఆపి రికార్డుల కోసం ఆరా తీశారు. ఆ సమయంలో ఆయన తడబడటంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల చోరీల అంశం వెలుగులోకి వచ్చింది. అతను వ్యసనాలకు బానిసగా మారాడు. తన జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలు అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. అతని నుంచి పోలీసులు 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కదిరి టౌన్, కదిరి రూరల్, గాండ్లపెంట, అనంతపురం, తాడిపత్రి, రాయచోటిలో 19 కేసులు ఉన్నట్లుగా గుర్తించారు. గాండ్లపెంటలో 2, రాయచోటి 2, కదిరిలో 26 వాహనాలు అపహరించినట్లుగా విచారణలో తేలింది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని డీఎస్పీ శ్రీలత అభినందించారు.

రోడ్డుపై స్పృహ తప్పి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన రెడ్డప్ప

గాలివీడు : రోడ్డుపై నడుస్తూ స్పృహ తప్పి కింద పడి వెలిగింటి రెడ్డప్ప(55) మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన రెడ్డప్ప గురువారం సాయంకాలం గాలివీడు గేటు నాలుగురోడ్ల కూడలి వద్ద దుకాణం నుంచి బయటకు వస్తూ రోడ్డుపైకి రాగానే ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు. వెంటనే 108 వాహనంలో స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు


ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి సమక్షంలో పార్టీలో చేరిన లేబాక గ్రామస్తులు


పార్టీలో చేరిన చింతరాజుపల్లి వారితో ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతున్నారు. గురువారం మండల పరిధిలోని ఆకేపాడు నారంరాజుపల్లి వద్దనున్న ఆకేపాటి ఎస్టేట్‌కు లేబాక గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. లేబాక మాజీ సర్పంచ్ సోదరుడు కడవకూటి సంజీవ్‌రాయుడు, ఉద్దండపు ప్రసాద్ ఆధ్వర్యంలో సాయి, ప్రవీణ్, లోకేశ్, మధు, మురళీ, శేఖర్, వెంకటరమణ తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ అందరికీ సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి ఆదుకున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, నందలూరు జెడ్పీటీసీ గడికోట ఉషావెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు గీతాల నరసింహారెడ్డి, అరిగే హరిబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

100 కుటుంబాల చేరిక

ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లి గ్రామంలోని 100 కుటుంబాల వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తామని కదలివచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.